
# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

# THE WORD OF TRUTH



**September 1994**

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్లు వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | కీర్తన పుస్తకం | రూ. 12-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**S A T Y A V A N I**

Sambamurthi St., Ramaraopeta,

K A K I N A D A - 533 004.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**



P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM



Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 — సెప్టెంబరు 1994 — సంచిక 2


## సంపాదకీయము

### అంత్య దినములు

### ( The Last Days )

దేవుని ప్రవక్తలు అంత్యదినములను గూర్చి పలికిరి: "అంత్య దినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును; ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వత్తురు. ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలువెళ్ళును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి, యాకోబు దేవుని మందిరమునకు, యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలలో నడుతుము అని చెప్పుకొం

దురు" (యెషయా 2 : 2, 3). మీకా కూడ యించుమించు యిదే సంగతులను ప్రవచించాడు (మీకా 4:1, 2).

క్రొత్తనిబంధనలో అపో. కార్యములు రెండవ అధ్యాయములో అపొస్తలులు ప్రభువు తమతో చెప్పినట్లుగా యెరూషలేములో కని పెట్టుచు యుండుట మనము చూడగలము (అపో.కా. 1 : 8; లూకా 24:44-49). యోహాను 14:16 లో వాగ్దానము చేయబడిన రీతిగ పరిశుద్ధాత్ముడు వారిపై కుమ్మరింపబడెను. తత్ఫలితముగా ప్రపంచములో యున్న వివిధ భాషలలో వారు మాట్లాడసాగారు. వారి మాటలను వినిన ప్రజలు ఆశ్చర్యచకితులై వారు మద్యముతో నిండియున్నారను కొనిరి. "అయితే పేతురు ఆ పదునొకరితో కూడ లేచి, నిలిచి బిగ్గరగా వారితో ఇట్లనెను: యూదయ మనుష్యులారా, యెరూషలేములో కాపురమున్న సమస్త జనులారా, యిది మీకు తెలియుగాక, చెవి యొగ్గి నా మాటలు వినుడి. మీరు ఊహించినట్లు వీరు మత్తులుకారు. ప్రొద్దుబొడిచి జామయిన కాలేదు. యోవేలు ప్రవక్తద్వారా చెప్ప బడిన సంగతి యిదే, ఏమనగా అంత్యదినముల యందు నేను మనుష్యు లందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను..." (అపో.కా. 2:14-17).

హెబ్రీ పత్రిక లేఖకు డిట్లు పలికాడు: "పూర్వకాలమందు నానా సమయములలోను, నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను" (హెబ్రీ 1:1, 2). మరల పౌలు తిమోతికి ఇట్లు వ్రాసాడు: "అంత్యదినములలో అపాయకర మైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలయనగా మనుష్యులు స్వార్థప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తలిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అప

విత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు క్రూరులు, సజ్జాన ద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు గర్వాంధులు, దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారుగ యుండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము" (2 తిమో 3:1-5).

పాతనిబంధన లేఖకులు 'అంత్యదినములు' భవిష్యత్తులో రాబోవుచున్నవని చెప్పారను సంగతి గమనించుము. అయితే క్రీస్తు మరణము తరువాత ఈ అంత్యదినములు వచ్చేయున్నవని చెప్పబడుచుండెను. పెంతెకొస్తు దినమున పేతురు యోవేలు ప్రవచించిన అంత్యదినములు యివే అని చెప్పినట్లు గమనించుము. యేసు ప్రభువు మరణముతో అంత్యదినములు ఆరంభమాయెను. గతంలో పితరుల యుగము, మోషే యుగము అను గొప్ప కాలములుండెను. యేసు మరణముతో మరొక క్రొత్తకాలము ఆరంభమాయెను. అది క్రైస్తవ యుగము. క్రీస్తు మరల రాకముందు జరిగే గొప్ప ఆఖరి యుగమిది. గనుక అంత్యదినములు క్రీస్తు మరణముతో ఆరంభమై ఆయన రెండవ రాకడతో అంతమగును. గనుక మనము అంత్యదినములలో యున్నామని గ్రహించనగును.

ఈ అంత్యదినములలో మరికొన్ని సంగతులు జరుగును. ఈ కాలములో అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదురు, క్రీస్తు సువార్త ప్రథమముగా ఈ లోకంలో ప్రకటించబడును, క్రీస్తు సంఘము స్థాపించబడును. క్రైస్తవ యుగము ఆరంభమగును. దేవుడు క్రీస్తుద్వారా మాటలాడును, క్రొత్తనిబంధన లిఖితపూర్వకముగా మానవుని కీయబడును మరియు క్రీస్తు యొక్క రెండవ రాకడ సంభవించును.

అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని

కూడ పౌలు హెచ్చరించాడు. పౌలు చెప్పిన దుష్టలక్షణములు సహజంగా మానవ సమాజములో యున్నను ఈ అంత్య దినములలో ప్రజలలో అవి మరి యెక్కువ ప్రబలునన్నట్లు అతడు చెప్పాడు. అయితే మానవుడు పాపములో యున్నాడు, నశించిపోవుచున్నాడు. అతనికి రక్షణ అవుసరం. క్రీస్తే అతన్ని రక్షించగలడు. గనుక మనం విశ్వాసముద్వారా ఆయనకు లోబడుదుము. ఆయన మనలను రక్షించి తన కుటుంబములో చేర్చుకొన గలడు. ఈ విధంగా మనం రక్షింపబడగలము. ఈ లోకాన్ని క్రీస్తు సువార్తద్వారా రక్షించగలం.

అంత్యదినములంటే, క్రీస్తు రాకకు ముందున్న కొన్ని దినములు మాత్రమే యని కొందరు భావిస్తారు. కాని ఈ అంత్యదినములు గత రెండువేల సంవత్సరములనుండి జరుగుచునే యున్నాయి. అవి మరెంత కాలము జరుగునో ఎవరికిని తెలియదు. ప్రభువు ఈరోజే రావచ్చును, ఒక వంద సంవత్సరాల తరువాత వచ్చును, లేదా కొన్ని వేల సంవత్సరాల తరువాత రావచ్చును. అయితే ఆయన ఎప్పుడు వచ్చేది ఎవరికి తెలియును? దేవునికి మాత్రమే తెలియును (మత్తయి 24 : 36). అయితే ప్రభువు రాకడకు ముందు ఎన్ని దినాలున్నను, నిత్యత్వముతో పోల్చుకొంటే అవి క్షణభంగురములే. గనుక మనము ప్రభువు రాకడకొరకు కనిపెట్టుకొని యుండాలి. ఆయన రాకడలో ఈ అంత్య దినములు అంతమవుతాయి. ఆయన వచ్చినప్పుడు మృతులందరు లేస్తారు, ఈ భూమ్యాకాశములు లయమై పోతాయి, తీర్పు జరుగుతాది. దుష్టులు నిత్యనరకాగ్నికిని; నీతిమంతులు నిత్యజీవానికిని కొనిపోబడుతారు. వారు ప్రభువుతో నిత్యము నివసించుదురు. మనకున్నదంతా అంత్యదినాలే. గనుక ఇప్పుడే సిద్ధపడుదాం. రెండో తరుణం అంటూ ఎవరికీ యేమీ ఉండదు.

# దేవుని రాజ్యము

## ( The Kingdom of the God )

"ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" (కొలస్స 1:13).

క్రొత్తనిబంధన సంఘమునకు అనేక లక్షణములున్నవి. దాని క్రియాజనకమైన ఏకత్వాన్ని, క్రీస్తుతో మనకు గల ఐక్యతను ఆలోచించునప్పుడు, సంఘము క్రీస్తుయొక్క శరీరమువలె మనకగుపడును (రోమా 4:5). ఆయన సంఘముగా మనకు లభించు ఆదర్శాభిమానములు, సహాయ సహవాసములను గూర్చి తలంచునప్పుడది దేవుని కుటుంబముగా నగుపడును (ఎఫెసీ 2:17). దేవునియొక్క ఏలుబడి, రాజాధికార దృక్కోణములో దాన్ని మనం ఆలోచించునపుడది ఈ పుడమిపై దేవుని రాజ్యమని గుర్తించుదము (మత్త 16:16-18).

ఈ వివిధ వర్ణనలు ఒకదానితో నొకటి పొసగనివి గాక, అవి ఒకదానితో నొకటి మిళితమై దైవిక సంస్థయగు సంఘముయొక్క పరిపూర్ణ తత్వాన్ని మనకు వర్ణించును. సంఘముయొక్క విశిష్ట ఘనత యేమంటే క్రీస్తు తన సిలువద్వారా అనుగ్రహించిన అనేక పరిశుద్ధ లక్షణము లందున్నవి.

నిశ్చయముగా మనము సంఘాన్ని రాజ్యముగా పరిగణించాలని పరిశుద్ధాత్ముడు కోరుచున్నాడు. క్రీస్తులోనికి మారుట అంటే అంధకార సంబంధమైన రాజ్యమునుండి క్రీస్తుయొక్క రాజ్యములోనికి మార్చబడుట యని అర్థము (కొలస్స 1:13). క్రొత్త నిబంధనలో మార్పు చెందుట యనగా క్రీస్తు శరీరములో ప్రవేశించుట యని చెప్పబడింది (రోమా 6:3; గలతీ 3:27). అయితే క్రీస్తు శరీరమే సంఘమని

చెప్పబడినది గనుక (ఎఫెసీ 1:21-23), క్రీస్తు శరీరమే లేక సంఘమే క్రీస్తు రాజ్యము లేక దేవుని రాజ్యమని మనము గ్రహించాలి. అదొక ఆత్మీయ సంస్థ.

'రాజ్యము' అను మాట బైబిలులో కనీసము ఆరు సందర్భాలలో వినియోగింపబడినది. 1) అది భూరాజ్యములను గూర్చి వాడబడినది (మత్తయి 4:8). 2) దేవుని రాజరికాన్ని సూచించునట్లు పాత, క్రొత్త నిబంధనలో వాడబడినది. దేవుడు ఇశ్రాయేలును తన జనాంగముగా ఎంచుకొన్నప్పుడు వారిని తన రాజ్యమని పిలిచాడు (నిర్గమ 19:5, 6). 3) దేవుని శక్తిని, ఏలుబడిని వర్ణించుటకది వాడబడినది (మత్తయి 12 : 28). దేవుని చిత్తానికి ప్రజలు ఎక్కడ విధేయులవుతారో అక్కడ దేవుని ఏలుబడి యుంటాది. 4) అది పరలోకంలో దేవుని ఏలుబడిని సూచించుటకు వాడబడినది. క్రైస్తవ సద్గుణములను మనము అలవరచుకొనిన యెడల, "మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును" (2 పేతురు 1:11). 5) అది సంఘమునకు వాడబడినది. సంఘము భూమిమీద దేవుని పరలోక రాజ్యముయొక్క ప్రతి బింబము. అందువలన అది పరలోక రాజ్యమనియు (మత్త 16 : 18, 19), దేవుని రాజ్యమనియు (యోహాను 3:5), తన ప్రియ కుమారుని రాజ్యమనియు పిలువబడినది (కొలస్స 1:13). 6) మరియు అది సాతాను యొక్క ఆధిపత్యమును వర్ణించుటలో వాడబడినది. సాతాను రాజ్యము అనే మాటలో వానియొక్క శక్తి వర్ణించబడినది (మత్తయి 12:26).

సంఘము దేవుని రాజ్యమనే భావంలో గొప్ప ప్రోత్సాహము ఇమిడియున్నది. గనుక ప్రత్యేకముగా భూమిమీద ప్రభువు రాజ్యమగు సంఘము యొక్క విశిష్టతలను గమనించుదము.

# ఆత్మీయ రాజ్యము

దాని ప్రాథమిక తత్వములో సంఘము ఒక ఆత్మీయ రాజ్యమై యున్నది. అది భౌతికం కాదు. పిలాతు యేసును యూదుల రాజువు నీవేనా? అని అడిగినప్పుడు (యోహాను 18:33), "యేసు-నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు; నా రాజ్యము ఈలోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నారాజ్యము ఇహసంబంధమైనది కాదనెను" (యోహాను 18:36).

రాజ్యముయొక్క ఆత్మీయ తత్వము సంఘమును గూర్చి ప్రాముఖ్యమైన సత్యములను పరిచయము చేయుచున్నది. మొదటిగా సంఘము యొక్క ముఖ్య కేంద్రము భూమిపై గాక పరలోకములో యున్నది. మన సార్వభౌముడగు క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు (అపొ.కా. 2:33). కాలాంతమువరకు భూమిమీద దేవుని రాజ్యముపై రాజుగా ఆయన ఏలుబడి చేయును. అప్పుడు రాజ్యమును తండ్రియగు దేవునికి ఆయన అప్పగించును (1 కొరింథీ 15:24). అందువలన క్రైస్తవులు యేసుయొక్క ప్రభుత్వము నంగీకరిస్తూ దేవుని ఏలుబడిలో ప్రవేశించినవారు (ఫిలిప్పీ 2:9-11).

రెండవదిగా క్రైస్తవులయొక్క కృషి ఆరాధనలు భౌతికంగా గాక ఆత్మీయకంగా కేంద్రీకృతమైనవి. మనము ఆత్మీయ యుద్ధాన్ని సలుపుతాం (ఎఫెసీ 6 : 12). దేవునికి ఆత్మీయ బలుల నర్పిస్తాం (1 పేతురు 2:5). ఆత్మీయాహారాన్ని బట్టి జీవిస్తాం (హెబ్రీ 5:12-14), మరియు మన పౌరస్థితి పరలోకమందున్నది గాన ఈ లోకంలో యాత్రికులవలె జీవిస్తాం (ఫిలిప్పీ 3:20; 1 పేతురు 2:11).

మూడవదిగా, ఈ ఆత్మీయ రాజ్య సభ్యులు ఈ లోకంలో యుంటున్న వారి పౌరస్థితి పరలోక రాజ్యములో యున్నది గనుక

ఈ లోకసంబంధమైన విషయములతో వారికి పొందిక లేక యుందురు. నిత్యత్వపు దృక్కోణమునుండి పరికించునపుడు ఈలోక సౌందర్యము అన్నియు క్షణ భంగురములే. క్రైస్తవునికి అపవాదికి జరిగిన సంభాషణను ఒకాయన అలంకార రీతిగా యిట్లు చెప్పాడు. "ఓ క్రైస్తవుడా నేను నీకు సమస్తాన్ని యిస్తాను. యిండ్లను, భూములను, కారులను, ధనాన్ని యిస్తాను" అంటాడు అపవాది. అందుకు క్రైస్తవుడు "నాకు అన్నీ ఉన్నాయి. ఈ భూమియు, అందున్న సమస్తమును నా తండ్రివే నాకన్నీ ఉన్నాయి గనుక నీవు నాకేమీ ఈయలేవు" అంటాడు. అప్పుడు అపవాది, "నేను అన్నీ తీసేసుకొంటాను. నీ యిండ్లను, ధనాన్ని, సుఖాన్ని అన్నీ నీనుండి దూరపరుస్తాను" అంటాడు. "నీవు నా దగ్గరనుండి యేమీ తీసికోలేవు. నాదంటూ యేమీ లేదు. నాకున్నదంతా దేవుడిచ్చినదే అని క్రైస్తవుడంటాడు. అప్పుడు అపవాది నిన్ను చంపుతా, నీ ప్రాణాన్ని తీసేస్తానంటాడు. నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభమని క్రైస్తవుడు చెబుతాడు. "నేను నీ జీవితాన్నంతా పాడుచేస్తా పాపులందరు అనుభవిస్తున్న సుఖాన్ని సంతోషాన్ని చూచి నీవు తప్పక గోలపెడతావు. ఎందువలనంటే నీవు వాటిని చేయలేవు. దుఃఖిస్తావు" అని అపవాది బెదిరిస్తాడు. "యేసు క్రీస్తు చిత్తాన్ని నెరవేర్చడమే నాకు అత్యంత ఆనందమని" క్రైస్తవుడు చెబుతాడు. దేవుని ఆత్మీయ రాజ్య సభ్యునిగా యుండుటవలన ఈ లోకం, దాన్ని శోధనలు మనకు చులకనగా అగుపడ్తాయి. అందువలన భక్తుడైన యోహానుతో కలిసి ఇట్లు చెప్పగలం: "లోకమును దాని ఆశయు గతించి పోవుచున్నవి గాని దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును" (1 యోహా 2:17).

పరలోక రాజ్యపు క్రైస్తవులు ఈ లోకాన్ని లోకస్తులవలె వీక్షించరు. ఈ లోకస్తులు తమ ఆస్థిపాస్థులను గూర్చి ఆందోళన చెందు

తారు. క్రైస్తవులు ఈ లోకంలో యున్నారు గాని వారు ఈ లోకానికి చెందినవారు కారు. మనం ఈ లోకానికి గాక ఒక ఆత్మీయ రాజ్యానికి చెందినవారము. మన ధ్యానం అంతా పరసంబంధమే గాని, ఇహసంబంధముగాదు. మనం రోగుల నాదరించి, ఆకలి గొన్నవారికి ఆహారమిచ్చి, అనాథులను ఆదుకొని ఈ లోకాన్ని బాగుచేయాలని కోరుచున్నా మన హృదయపు యదార్థవాంఛ నిత్యత్వమే. అన్నిటికంటే ప్రముఖంగా మన పొరుగువాని యొక్క ఆత్మ రక్షణను మనం కోరుదుము. మనం జీవించేది ఆత్మీయ లక్ష్యానికే గాని, భౌతికానికి కాదు. ఈ లోకస్థులు ధనాన్ని, క్రైస్తవులు ఆత్మలను సంపాదిస్తారు.

## నీతి రాజ్యము

సంఘము నీతి రాజ్యమై యున్నది. పరలోక రాజ్య పౌరులు యిది వరకు తాము జీవించినట్లు జీవించరు. ఈ రాజ్య సంబంధులు వెలుగు సంబంధులని పౌలు చెప్పాడు: "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువునందు వెలుగై యున్నారు. వెలుగు ఫలము సమస్త విధములైన మంచితనము, నీతి సత్యములో కనబడుచున్నది. గనుక ప్రభువు కేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి" (ఎఫెసీ 5 : 8-10). మరల "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదుగాని, సమాధానమును పరిశుద్ధాత్మ యందలి ఆనందమునై యున్నది" అని అతడు చెప్పాడు (రోమా 14:17).

క్రొత్త నిబంధన రెండు రకాలైన నీతిని గూర్చి చెప్పుచున్నది. మొదటిది మన కనుగ్రహింపబడిన నీతి. దీనిని గూర్చి ఆత్మా వేశ లేఖకులు తరుచు చెప్పియున్నారు. మనము బాప్తిస్మము పొందినప్పుడు నీతి మనకు ఆపాదించబడతాది. దేవుని యెదుట నీతిమంతులమని తీర్చబడుదుము. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు

"నమ్ము వారు ఆయన కృపచేతనే క్రీస్తు యేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు" (రోమా 3:24). రెండవదిగా మనము కనబరచు నీతినిగూర్చి క్రొత్తనిబంధన చెప్పుచున్నది. క్రైస్తవులు నీతిలో జీవిస్తు యుండాలి, కనబరచుచు యుండాలి. "ఆయన నీతిమంతుడై యున్నట్లు నీతిని జరిగించు ప్రతివాడును నీతిమంతుడని" యోహాను చెప్పాడు (1 యోహాను 3:7). క్రైస్తవులు పాపము జరిపిస్తు పాపములో జీవించుచు యుండలేరు. ఏలయనగా "పాపము చేయువాడు అపవాది సంబంధి... దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయజాలడు" అని అతడు చెప్పాడు (1 యోహాను 3:8, 9). గనుక దేవుని రాజ్యము నీతి రాజ్యమై యున్నది. దానిలో ప్రవేశించువారికి నీతి అనుగ్రహించబడును. మరియు దానిలో పౌరులుగ జీవించువారు తమ నీతిని కనబరచుచు యుంటారు.

హృదయములో దేవునియొక్క ఏలుబడి, రాజరికము మానవుని జీవితంలో నీతిగా ప్రదర్శింపబడతాది. అమెరికాలో ధనవంతుడైన సంఘసభ్యు డొకాయన యుండెను. అతడు యితరులనేమీ ఆదుకొనేవాడుకాదు. సరిగదా ఎప్పుడు మూడు రూపాయలకంటె ఎక్కువ చందా నీయలేదు. అతడు రాజ్యములో యున్నా, రాజ్య మతనిలో లేదు. మన హృదయాల్లో దేవుడు ప్రభువుగా నుండి పరిపాలించునప్పుడు మనం నిజంగా ఆయన రాజ్య పౌరులము. ఆయన రాజ్యంలో పౌరులముగా యుండాలంటే దేవునియొక్క సార్వభౌమ్యాన్ని అంగీకరించి అనుదినము మన జీవితాల్లో ఆయన చిత్తానికి లోబడుచు యుండాల్సినదే.

## నిత్య రాజ్యము

మరల దేవుని రాజ్యము భూమిపై నిత్యరాజ్యమై యున్నది.

అది క్షణభంగురమైనది గాని, తాత్కాలికమైనది గాని కాదు. అది స్థిరమైనది, నిశ్చలమైనది, నిత్యమైనది. పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదని దానియేలు ప్రవచించాడు (దానియేలు 2 : 44). గబ్రియేలు దూత మరియకు ప్రత్యక్షమై ఆమె పరిశుద్ధాత్మని వలన మెస్సీయాకు తల్లి కాబోవుచున్నదని, ఆయన స్థాపించు రాజ్యమునకు అంతముండదని బయలు పరచాడు: "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును. ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను" (లూకా 1 : 32, 33). యేసుక్రీస్తు తన సంఘమును స్థాపించెదనని ప్రకటించినప్పుడు పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని చెప్పెను (మత్తయి 16:18). దేవుని రాజ్యము నిశ్చలమైన రాజ్యమని హెబ్రీ 12:28లో చెప్పబడి యున్నది.

పరలోకరాజ్యపు పౌరులుగా క్రైస్తవులు నిత్యజీవమును కలిగియున్నారు. ఆ జీవమును ప్రస్తుతం అనుభవిస్తు భవిష్యత్తులో నిరీక్షించునట్టిదై యున్నది. యేసును కలిగియున్న వారందరు ఇప్పుడు నిత్యజీవమును కలిగియున్నారు, ఏలయనగా ఆయన సశరీరుడుగా ప్రత్యక్షమైన నిత్యజీవము (1 యోహాను 1:2). అందువలన "తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకుని యందును నిత్యజీవముండదని మీరెరుగుదురు" అని యోహాను వ్రాసాడు (1 యోహాను 3:15). మనము ప్రస్తుతము అనుభవించు జీవితములోను, నిత్యత్వములో దానిని పొందుదుమనే నిరీక్షణలోను దేవుని రాజ్యము యొక్క నిత్యత్వము ప్రత్యక్షమగుచున్నది.

నిత్య జీవములో మన ప్రవేశము తల్లి గర్భమునుండి ఉదయిం

చిన శిశువును పోలినట్టిదని చెప్పబడినది. శిశువు తల్లి గర్భములో యుండగా జీవము కలిగి గర్భస్థ వాతావరణము ననుభవించును. అయితే ఆ వాతావరణములో అతనికి ఆహారము, సుఖము, భద్రత కల్పించబడినను అది కొద్ది మాసములమట్టుకే పరిమితమై యుండును. అయితే అతడు జన్మించినప్పుడు ఆ శిశువు జీవమునే అనుభవించును గాని దాన్ని ఇంకొక వాతావరణంలో, పరిపూర్ణంగా అనుభవించును. ఈ నూతన వాతావరణంలో పెరుగుదలకు, సహవాసానికీ, కృషికి అంతులేని అవకాశముల ననుభవించును. మన హృదయాల్లో ఇప్పుడు యేసు జీవిస్తువుంటే ఆయన ఆశ్చర్యకరమైన ఒక నూతన జీవితాన్ని మన కనుగ్రహించెను - నిత్యజీవము. అయితే మనము ఈ జీవాన్ని దాటి ఆవలికి వెళ్ళినప్పుడు ఈ నిత్యజీవము మరింత పరిపూర్ణముగా పరలోక సంతోషము, సహవాసము, నిత్య పరిచర్య మొదలగు వాటిలో ప్రత్యక్షమగును.

క్రైస్తవులు సమయాన్ని బట్టిగాని, ఇహలోకపరిమాణాలను బట్టిగాని సంకుచితము చేయబడని నిత్య రాజ్యములో భాగస్థులై యున్నారు. దేవుని వాక్యానికి మనము నమ్మకముగా యుంటూ దేవుని భద్రత వలయములో జీవించునంత కాలము ఎన్నడు నాశనము గావించబడని రాజ్యములో మనమొక భాగమై యున్నాము. దానికి అంతముండదు.

## ముగింపు

క్రైస్తవుని హృదయంలో దేవుని రాజరికమును, ఏలుబడిని మన పాఠ్యాంశముగా వినియోగిస్తూ, క్రొత్తనిబంధన సంఘము దేవుని రాజ్యమని మనము తెలుసుకొన్నాము. అది ఆత్మీయమైనది, నీతి మైనది, నిత్యమైనది. దాని పౌరులు ఈ లోకంలో జీవిస్తు యున్నా

వారి హృదయము, పౌరసత్వము వేరొక లోకంలో, దేవుని నిత్య రాజ్యంలో యున్నవి (కొలస్స 3:1, 2; ఫిలిప్పీ 3:20).

దేవుని రాజ్యమునుగూర్చి మరింత తెలుసుకోవాలని యూదుల అధికారి యగు నీకొదేము యేసునొద్దకు వచ్చాడు. ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని దేవుని రాజ్యమును చూడలేడని యేసుప్రభువు అతనితో చెప్పెను. మరియు "యేసు ఇట్లనెను-ఒకడు నీటిమూలము గాను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నా ననెను" (యోహాను 3:5). అధికారపూర్వకముగా దేవుని రాజ్యము స్థాపించబడిన దిన మందు విశ్వాసులైనవారు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమి త్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని అపో. పేతురు హెచ్చరించెను (అపో.కా. 2:38-41). నీకొదేముతో యేసు చేసిన సంభాషణలోని క్రొత్తజన్మను అపో.కా. 2వ అధ్యాయములో పేతురు అమలుపరచెను. దేవుని రాజ్యములోనికి జన్మించాలన్నా, ప్రవేశించాలన్నా ఒకడు యేసునందు విశ్వాసముంచాలి (యోహాను 3:16). పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, దేవుని తట్టు తిరగాలి (అపో. కా. 17:30). యేసే దేవుని కుమారుడని ఒప్పుకోవాలి (రోమా 10:9, 10), పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తి స్మము పొందాలి (అపో.కా. 2:38; 22:16).

దేవుని రాజ్యములో పౌరసత్వమువలన మానవజీవితం ఆత్మీయంగా కేంద్రీకృతమవుతాది. అది జీవితంలో ప్రతి పరిమాణంలోను ప్రజ్వ రిల్లుతాది. జీవితానికి స్థిరత్వము, నడిపింపు, సంపూర్ణ భావము, పరి పూర్ణత నెలకొల్పుతాది. ఈ పవిత్ర పౌరసత్వము నీతిని, భక్తిని, మంచితనమును శాంతిని మన జీవితాల్లో నెలకొల్పుతాది. క్షణభంగుర

మైన ఈ లోకంలో దేవుని రాజ్యము నేటికీ, నిత్యత్వానికీ మన జీవితాల్లో నిత్యజీవమును ప్రసాదించును.

నీవు దేవుని నిత్యరాజ్యములో, అనగా క్రీస్తు సంఘములో సభ్యుడవా?

—ఎడ్డీ క్లోర్, (TFT.)

— 0 —

కొండమీద ప్రసంగము - 7

## సమాధానపరచువారు ధన్యులు

### (Blessed are the Peace Makers)

(మత్తయి 5 : 9)

"సమాధాన పరచువారు ధన్యులు. వారు దేవుని కుమారు లనబడుదురని" యేసుప్రభువు చెప్పారు. ఆయన కొండమీద చేసిన ప్రసంగములో చెప్పిన ధన్యతలలో యిది ఏడవది. కలహప్రియులు శాపగ్రస్థులు, వారు అపవాది కుమారు లనబడుదురని కూడ మనం ఈ ధన్యతయొక్క వ్యతిరేక భావాన్ని తెలియజేయవచ్చును. మన దేవుడు సమాధానకర్తయగు తండ్రి (రోమా 15:33). యేసుక్రీస్తు సిలువత్యాగము వలన దేవునికిని మానవునికిని మధ్య సమాధాన కర్తగా పనిచేసెను. క్రైస్తవులు సహజంగా క్రీస్తుయొక్క పనిలో పాలివారై యున్నారు. వ్యక్తిగత శ్రమలను సహితము వారు ఓర్చుకొని సమాధానము కొరకు పాటుపడుదురు.

అవివేకంగా తర్కించువారు, కలహప్రియులు, నిష్ప్రయోజనములైన వాదములు చేయువారు సమాధాన పరచువారుకాలేరు. అట్టి వారికి క్రైస్తవుడు దూరముగా ఉండాలని హెచ్చరింపబడినది. అహంకార దృష్టి, కల్లలాడునాలుక, నిరపరాధులను చంపుచేతులు, దుర్యోచనలు యోచించు హృదయము, కీడుచేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములు, లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు, అన్నదమ్ములలో

జగడము పుట్టించువాడును యెహోవాకు హేయములు" (సామె 6:16-19). సమాధానపరచువారు దేవుని కుమారులని ఎట్లనబడుదురో, జగడములు సృష్టించువారు అపవాది సంతాన మనబడుదురు. "అపవాది మొదటనుండి పాపము చేయుచున్నాడు గనుక పాపముచేయువాడు అపవాది సంబంధి" (1 యోహాను 3:8). "ఆదినుండియు వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడుకాడు; వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడు నప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు" (యోహాను 8:44).

## దేవునితో సమాధాన పడాలి

యేసుక్రీస్తుబట్టి క్రైస్తవుడు సమాధానపరచు తత్వముగలవాడు. అతడు పరుల విషయమైన ఆసక్తి గలవాడు, సహనము ఓర్పు గలవాడు. అతని సంభాషణలో శాంతి సమాధానములు కనబడును. "మీలో మీరు ఉప్పుసారముగలవారై యుండి యొకరితో ఒకరు సమాధానముగా ఉండుడని" ప్రభువు తన శిష్యులను హెచ్చరించారు (మార్కు 9:50). సమాధానపరచువాని క్రియలు మేలైనవి, శ్రేష్ఠమైనవి. మనము ఒకరినొకరు ఎదురైనప్పుడు 'సలామ్' చెబుతాము. అంటే సమాధానము కలుగుగాక యని అర్థము. సమాధానపరచువారు సహజంగా మధ్యవర్తిత్వము వహిస్తారు. పరులు జగడమాడుచుండగా ఒకరి ప్రాణాన్ని మరొకరు తీయజూచుచుండగా సమాధానకర్త ఈ ద్వేషాగ్నిని ఆర్పుతాడు. మానవుల మధ్య ఐక్యతను, స్నేహాన్ని తిరిగి నెలకొల్పుతాడు. సమాధానపరచువానికి ధైర్యము అవుసరం. ఏలయనగా యిరుపక్షములవారు అతన్ని తూలనాడ వచ్చును, నిందించవచ్చును. క్రైస్తవుడు సమాధానపరచువానివలె యుంటూ తన పొరుగువారి ఆత్మల రక్షణార్థము కృషి చేస్తాడు. మానవులు ఒకనితో మరొకడు సమా

ధానముగా యుండాలంటే, మొదట వారు దేవునితో సమాధాన పడాలి. పాపము చేయు ప్రతివాడు దేవునిపై తిరుగుబాటు చేయుచున్న వాడే. అతడు యేసుక్రీస్తునందు నమ్మి బాప్తిస్మము పొంది తన పాప క్షమాపణను, రక్షణను పొందాలి. అప్పుడు మాత్రమే దేవునికి మానవునికి మధ్య సమాధానము ఏర్పడును. ఒకడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగానే ప్రభువతని రక్షించి తన సంఘ ముతో చేర్చుకొనును (అపొ.కా. 2:38; 47). అప్పుడు మాత్రమే మానవుని ఆత్మలోని అంతర్యుద్ధము విరమించబడును. దేవునితో సమాధానపడిన మానవుడు, తోటి మానవులతో సమాధానము కలిగి యుండుట సులభము. సమాధానపరచువారు ధన్యులు వారు దేవుని కుమారులనబడుదురు.

## గృహములో సమాధానం

దేవునితో సమాధానపడిన తరువాత ఒకడు తన హృదయ ములో సమాధానము కలిగియుండాలి. గృహములో శాంతి సమా ధానములు లేక జగడములు, అశాంతి, దుఃఖము వగయిరా ఉన్న ప్పుడు ఇంటిలో ఉన్నవారిలో ఎవరిదో ఒకరి హృదయం మంచిది కాదన్నమాట. అట్టి సందర్భాలలో బహు స్వల్ప విషయాలపై భార్యా భర్తలు జగడము లాడతారు. జ్ఞానియైన సొలొమోను సమా ధానము గల గృహాన్ని గూర్చి యిట్లు చెప్పాడు: "గయ్యాళితో పెద్దయింట నుండుటకంటె, మిద్దెమీద నొక మూల నివసించుట మేలు" (సామె 21:9). "పగవాని యింట క్రొవ్విన యెద్దు మాంసము తినుట కంటె, ప్రేమగలచోట ఆకుకూరల భోజనము తినుట మేలు" (సామె 15 : 17). "తన యింటివారిని బాధపెట్టువాడు గాలిని స్వతంత్రించు కొనును" (సామె 11 : 29). ప్రతి గృహంలోను "సమాధానముగా నుండుటకు దేవుడు మనలను పిలిచియున్నాడని" అపొ.పౌలు చెప్పాడు

(1 కొరింథీ 7:15). మీ గృహములో శాంతి సమాధానములు లేకపోతే గృహస్థు లందరు కలసి దేవుని వాక్యాన్ని చదవండి, మోకాళ్ళూని ప్రార్థించండి. "నీతిఫలము సమాధానము చేయువారికి సమాధాన మందు విత్తబడును" అని యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 3 : 18).

## సంఘములో సమాధానము

"సమాధానపరచువారు ధన్యులు". స్థానిక సంఘములో కూడ ఒకడు సమాధానాన్ని వెదకాలి. ఎవని మ్రింగుదునా యని మన విరోధియైన అపవాది వెదకుచు తిరుగుచున్నాడు. గృహంలో శాంతి సమాధానములను వాడు పాడుచేయకపోతే సంఘములో అల్లర్లు సృష్టించగోరతాడు. క్రీస్తు సంఘ ఆరంభ దినాల్లో శిష్యుల సంఖ్య విస్తరించుచున్నప్పుడు తమలోని విధవరాండ్రను చిన్నచూపు చూచిరని హెబ్రీయులమీద గ్రీకుభాష మాట్లాడు యూదులు సణగసాగిరి. భాష విభేదము తెచ్చి అపవాది అల్లరి సృష్టించాలని యత్నించాడు. అయితే అపొస్తలులు సహోదరులారా ఆహారము వగయిరా పంచి పెట్టబడుటకు మంచి పేరుపొందిన యేడుగురు మనుష్యులను మీలో ఏర్పరచుకొనుడని చెప్పి ఈ బాధ్యతను వారికే అప్పగించారు. ఇందును గూర్చిన సమస్య మరల యెరూషలేము సంఘములో ఎన్నడు తల యెత్తనేలేదు (అపొ.కా. 6వ అధ్యా). సంఘ సభ్యులు అహంభావాన్ని చంపుకొగలిగితే స్థానిక సంఘములలో శాంతి సమాధానాలు ఎల్లప్పుడు ఉంటాయి. అయితే క్రీస్తు బోధకు వ్యతిరేకముగా భేదములను ఆటంకములను కలుగజేయువారిని కనిపెట్టుకొని యుండాలి. అట్టివారి నుండి తొలగిపోవాలని అపొ.పౌలు హెచ్చరించాడు. "అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన

మాటల వలనను ఇచ్ఛకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17, 18).

సమాధాన పరచువారముగా లేక సమాధానమును వెంటాడువారిగ మనముండుట మంచిదే. అది హర్షించదగినదే అయినను, ఆ ఒక్క లక్షణము వలననే మనము పరలోకము చేరుకోలేము. సమాధాన పరచువారు దేవుని కుమారులన బడుదురని చెప్పబడి యున్నది. అయితే "తన్ను ఎందరంగీకరించిరో వారి కందరికి, అనగా తన నామము నందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను" అని వ్రాయబడియున్నది (యోహాను 1 : 12). నిజమే. అయితే మనం దేవుని కుమారులముగా ఎట్లవుతాము? "క్రీస్తు యేసునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు...యేసుక్రీస్తు నందు మీరందరును ఏకముగా ఉన్నారు. మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు" (గలతీ 3:26-29). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందేవరకు మనం దేవుని కుమారులము కాలేము.

మానవులందరు దేవునిచే సృజింపబడినవారు గనుక వారు దేవుని కుమారులే (ఆది 6:2). ఆదాము దేవునికి కుమారుడు (లూకా 3:38). మనం ఆదాము కుమారులము. అయితే అపవాదివలన ఉచ్చులో పడద్రోయబడి దేవుడు మనకిచ్చిన ప్రధానత్వాన్ని నిలుపుకోలేకపోయాము. అందువలన పాపమునకులోబడి అపవాది సంతతి అయ్యాము. ఎలుమ అను వానిని అపో. పౌలు "సమస్త కపటముతోను సమస్త దుర్మార్గముతోను నిండినవాడా, అపవాది కుమారుడా, సమస్త నీతికి విరోధీ" అని సంబోధించాడు (అపో. కా.

13 : 10). మనం పాపము చేయుటవలన అపవాది సంతతివారమైనను దేవుని కృపనుబట్టి ఆత్మమూలముగాను నీటిమూలముగాను తిరిగి జన్మించుట ద్వారా దేవుని బిడ్డలము కావచ్చును (యోహాను 3:3-5).

"యేసే క్రీస్తయి యున్నాడని నమ్ము ప్రతివాడును దేవుని మూలముగా పుట్టి యున్నాడు - మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చువారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని దానివలననే యెరుగుదుము" (1 యోహాను 5:1-2). క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన ప్రతివాడు దేవుని బిడ్డ యగును. "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి. మనము దేవుని పిల్లలమే" (1 యోహాను 3:1).

శాంతిని సమాధానమును విత్తువారు దేవుని కుమారులు, సమాధానకర్త యగు దేవుని కుమారులు. తమ తండ్రియైన దేవుని లక్షణములను వారు కనబరుస్తారు. దైవత్వములో వారు పాలి భాగస్థులు. గనుక వారు ఆనందముతో నిండియుంటారు. ఐక్యత కలిగి యుంటారు. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంతమనోహరము!" (దా.కీర్త 133:1). "తుదకు సహోదరులారా, సంతోషించుడి, సంపూర్ణులై యుండుడి, ఆదరణ కలిగి యుండుడి, ఏక మనస్సు గలవారై యుండుడి, సమాధానముగా ఉండుడి" (2 కొరింథీ 13 : 11). సమాధాన పరచువారు ధన్యులు, వారు దేవుని కుమారులనబడుదురని గుర్తుంచుకొనుడి! ప్రేమ సమాధానములకు కర్త యగు దేవుడు మీకు తోడై యుండును గాక!!

—జాషువా గూటం.

— o —

## విశ్వాసముద్వారా కానట్టి కొన్ని విషయములు

## ( Somethings not by Faith )

ఆరాధన సమయములో వాయిద్యములతో పాడుట వారి

ఉద్దేశ ప్రికారము చేయునదిగాని అది దేవుని ఆజ్ఞ కాదు. కనుక వారు దేవుని నమ్ముటలేదు. వారిని వారు సంతోషపరచుకొనుట కొరకే అట్లు చేయుదురు గాని అది దేవుని ఆజ్ఞ కాదని వారు అంగీక రించరు. బైబిలు యేమి చెప్పుచున్నదో వారికి అక్కరలేదు. క్రొత్త నిబంధన గ్రంథములో పాడుటను గూర్చి పది వాక్యము లున్నవి గాని అరాధనలో వాయిద్యములతో కూడిన సంగీతమును గూర్చి ఒక్కటి కూడ వ్రాయబడి యుండలేదు.

శతాధిపతియైన కొర్నేలి తన యింటివా రందరితో కూడ దేవుని యందు భయభక్తులు గలవాడై యుండి, ప్రజలకు బహు ధర్మము చేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థన చేయువాడు (అ.కా. 10:2). అతడు రక్షణ కొరకు అడిగినందుచేత దేవుడు వానిని రక్షించెనా? అతడు దేనికొరకు ప్రార్థించెనో మనమెరుగము. తన ప్రార్థనలకు ప్రతిఫలముగా దేవుడతనిని రక్షించలేదని మనకు తెలుసు. వేరే మరొక పని చేయుమని దేవుడతనికి చెప్పెను. యెహోవా దేవుడు కొర్నేలి ప్రార్థనలను జ్ఞాపకము చేసికొని అతడు రక్షింపబడునట్లు యేమిచేయవలెనో ఒక మనుష్యుడు చెప్పునని చెప్పెను. అందుకా మనుష్యుడు యిట్లనుచున్నాడు. "మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్ళకు ఆటంకము చేయ గలడా అని చెప్పి యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొంద వలెనని ఆజ్ఞాపించెను" (అ.కా. 10:47-48).

అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో వివరింప బడిన ఆ ప్రత్యేక దినమందు క్రీస్తు సంఘము స్థాపింపబడెను. ఆ దిన మున మూడువేల మంది రక్షింపబడిరి. ఏ ఒక్కరూ కూడ వారి స్వంత అభిప్రాయముల ననుసరించుటద్వారా రక్షింపబడలేదు. ఆత్మతో నింపబడినవారు బోధించిన విషయములను వారు నమ్మిరి.

వారి మాటలు వినవలెనని వారు హెచ్చరింపబడిరి. మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని చెప్పెను (అ.కా. 2:36). అపొస్తలుడైన పేతురు ఈ మాటలు చెప్పుచుండగా అచ్చట కూడియున్న వారందరు వినిరి.

సీమోను పేతురు ద్వారా పరిశుద్ధాత్మ చెప్పిన మాటలను బట్టి వారు హృదయమందు నొచ్చుకొని, "సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును, మిగిలిన అపొస్తలులను అడిగిరి". మానవాళిని రక్షించుటకై ఏతెంచిన రక్షకుని చంపితి రను మాటను వారంగీకరించిరి. ఇంకనూ వారు చేయవలసిన దేమిటో వారు తెలిసికొనవలెనని యుండిరి.

వారు యేసును చంపితిరని చెప్పినదానిని అంగీకరించుటను బట్టి మీరు ఒప్పుకొనినది మంచిదే అని పరిశుద్ధాత్మ వారికి చెప్పలేదు గాని నిజమైన విశ్వాసము, నమ్మికగలవారు పేతురు చెప్పిన మాటల యందు లక్ష్యముంచిరి. అవి "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అ.కా. 2:38) అనునవి.

లూకా యిట్లు వ్రాయుచున్నాడు. "అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు యించుమించు మూడు వేల మంది చేర్చబడిరి. వీరు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి"(అ.కా. 2:41-42).

—W·C. ఏండర్సన్.

—o—

## క్రైస్తవునిలో పరిశుద్ధాత్మ నివాసము - పని

పరిశుద్ధాత్మ నివాసము క్రైస్తవునిలో క్రొత్తజన్మ యందు ప్రారంభించబడును (1 కొరింథి 3:16; 6:19). "మీరు దేవుని ఆలయమై యున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించు చున్నాడనియు మీ రెరుగరా?". "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీ రెరుగరా!" (యోహాను 3:36; 1 కొరింధీ 3:16; 6:19).

ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు అబ్రహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తు యేసుద్వారా అన్యజనులకు కలుగుటకై క్రీస్తు మన కోసము శాపమై మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను (గలతీ 3:13, 14).

మనము పొందియున్న పరిశుద్ధాత్మ వాగ్దానము పాతనిబంధన యందు ప్రవచింపబడెను. నేను దప్పిక గలవానిమీద నీళ్ళను ఎండిన భూమిమీద ప్రవాహ జలములను కుమ్మరించెదను. నీ సంతతిమీద నా ఆత్మను కుమ్మరించెదను. నీకు పుట్టిన వారిని నేను ఆశీర్వదించెదను. నీటికాలువ యొద్ద నాటబడిన నిరవంజి చెట్లు గడ్డిలో ఎదుగునట్లు వారు ఎదుగుదురు (యెషయా 44:3-4). నూతన హృదయమ్ము మీ కిచ్చెదను నూతన స్వభావము మీకు కలుగజేసెదను. రాతిగుండె మీలోనుండి తీసివేసి మాంసపు గుండెను మీకిచ్చెదను. నా ఆత్మను మీయందుంచి నా కట్టడలను అనుసరించు వారినిగాను నా విధులను గైకొనువారినిగాను మిమ్మును చేసెదను. నేను మీ పితరుల కిచ్చిన దేశములో మీరు నివసించెదరు. మీరు నా జనులై యుందురు. నేను మీ దేవుడనై యుందును (యెహెజ్కే 36:26-28). నీటి బాప్తిస్మము నందు పరిశుద్ధాత్మ మన శరీరములను తనకు ఆలయముగాను నివాస స్థలముగాను ఏర్పరచుకొని తన పనిని కొనసాగించుచు మన మంద

రము ప్రభువైన క్రీస్తు పోలికగా (స్వభావములోనికి) మార్పు చెందు నట్లు నివాసము చేయుచున్నాడు. దేవుని ఆత్మ సంబంధమైన సంగతులు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమములుగా వర్ణింపబడెను (రోమా 8:2). క్రొత్త నిబంధనయందు జీవమునిచ్చు ఆత్మ నియమములు అనేకములు గలవు. ఆ నియమములను అనుసరించి ప్రవర్తించునట్లు పరిశుద్ధాత్మ క్రైస్తవునిలో నివసించుచు ఆత్మ విషయములను ఆత్మ విషయములతో సరిచూడగలుగు ఆలోచన అనుగ్రహించి క్రీస్తు రూపములో ఎదుగునట్లు సహాయపడును. క్రీస్తు వాడుగా ఉండునట్లు సహాయపడును. ఆత్మ స్వభావము గలవారుగా ఉండునట్లు సహాయపడును. ఎందువలననగా క్రీస్తు ఆత్మ లేనివాడు క్రీస్తువాడు కాడు. క్రీస్తువాడు కానివాడు శరీరానుసారమైన మనస్సు కలిగిన వాడును దేవునికి విరోధియునై యున్నాడు.

ఆత్మానుసారులు ఆత్మ విషయములమీద మనస్సుంతురు. అట్టివారు జీవము సమాధానము కలిగియుందురు. ఎందువలననగా క్రొత్తగా జన్మించుట వలన దేవుని రాజ్యములో ప్రవేశించుచున్నాము. దేవుని రాజ్యము నందు దేవుడు నీతి సమాధానము పరిశుద్ధాత్మ యందలి ఆనందమును గల పరిపూర్ణ మానసిక వాతావరణమును ఏర్పాటుచేసి అందు క్రైస్తవుడు దేవుని స్వరూప స్వభావ లక్షణాలతో ఎదుగునట్లు ఆ నిత్యరాజ్యమునకు జీవమునిచ్చు ఆత్మ నియమాలతో గల క్రొత్త నిబంధనను అనుగ్రహించెను. అట్టి జీవము నిచ్చు ఆత్మ నియమాలుగల క్రొత్త నిబంధన యందుగల సంగతులు గ్రహించునట్లు తండ్రియైన దేవుడు తన పరిశుద్ధాత్మను లేఖనానుసారముగా మార్పు చెందిన ప్రతి క్రైస్తవునికి అనుగ్రహించెను. తండ్రియైన దేవుడు తన కృపచేత అనుగ్రహింపబడిన క్రొత్త వాగ్దానము ఇట్టి దేవుని ఆత్మ వలన ప్రతి క్రైస్తవుడు ఆత్మను అనుసరించి క్రమ

ముగా నడుచుకోవాలని అపొస్తలుడైన పౌలు హెచ్చరించుచుండెను. "మనము ఆత్మను అనుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందము" (గలతి 5 : 25).

తండ్రియైన దేవుని దయా సంకల్పమునకు విధేయత చూపించిన మనలను తన కుమారులుగా అంగీకరించినందున మనము సర్వశక్తి గల దేవునిని నాయనా తండ్రీ అని మొఱ్ఱపెట్టు ఆత్మను మన హృదయములలోనికి పంపెను (గలతీ 4:6). క్రైస్తవులమైన మనము సర్వశక్తి గల దేవుని తండ్రిగా భావించు సత్యమును పరిశుద్ధాత్మ మనకు బయలుపర్చి యున్నాడు. "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో సాక్ష్యమిచ్చుచుండెను" (రోమా 8:16). ఇట్టి సాక్ష్యము మనలోనున్న విశ్వాసమును బలపర్చుట వలన మనలోనున్న భయమును అనుమానములను తీసివేయుటయే గాక మనము దేవుని యింటివారమను ఆలోచన మనలో రేకెత్తించుచు మనలను ఆత్మ ఫలములు ఫలించునట్లు ప్రోత్సహించును. "ఈ హేతువుచేత పరలోకమందును భూమిమీదను ఉన్న ప్రతి కుటుంబము ఏ తండ్రిని బట్టి కుటుంబము అని పిలువబడుచున్నదో ఆ తండ్రి ఎదుట నేను మోకాళ్ళూని మీరు అంతరంగ పురుషునియందు శక్తి కలిగి ఆయన ఆత్మవలన బలపరచబడునట్లుగాను క్రీస్తు మీ హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయచేయవలెననియు మీరు దేవుని పరిపూర్ణతయందు పూర్ణులగునట్లుగా ప్రేమయందు వేరుపారి స్థిరపడి సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు, పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, తగిన శక్తిగలవారు కావలెనని ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3 : 14-19). (సశేషం)

—M. ఆల్ ఫ్రెడ్, రామచంద్రపురం

— 0 —

# సంక్షిప్త వార్తలు

1994 ఆగష్టు నెల సువార్తికుల సదస్సు 25వ తేదీ గురువారం నాడు అమలాపురం తాలూకా నడిపూడి గ్రామంలో అత్యంత ఆత్మీయకంగా జరిగెను. ఆ దినమంతయు పలుప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులతో నడిపూడి గ్రామము కలకలలాడింది, వారు క్రీస్తును గూర్చి ప్రకటించిన గంభీర సత్యముతో దద్ధరిల్లినది.

ఉదయ కాలపు సమావేశమునకు సోదరులు వి. చిన్నయ్యగారు అధ్యక్షత వహించి చక్కని సందేశములను, హెచ్చరికలను యిచ్చి సోదరులను ప్రోత్సహించిరి. ఆచంటనుండి వచ్చిన సోదరులు కె. ప్రసాద్ గారి ప్రార్థనతో సభ ఆరంభమయ్యెను. తదుపరి "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది" ఎట్లు? అను అంశమును సోదరులు సుదీర్ఘముగా చర్చించిరి. యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెననుమాట నమ్మదగినది. మానవాళి చరిత్రయే దీనికాధారము. క్రీస్తు రాకవలన చరిత్ర అంతయు క్రీస్తు పూర్వమనిగాని, క్రీస్తు శకమనిగాని లెక్కింపబడుచున్నది. మనుష్యుడు ఎప్పుడు ఎక్కడ, ఏ తేదీ వేసినా, అది క్రీస్తు రాకను బట్టియే లెక్కింపబడుచున్నది. ఆయన ఈలోకమునకు వస్తాడని పాతనిబంధనలో ప్రవచింపబడినది, ఆయన వచ్చి వెళ్లెనని క్రొత్తనిబంధన చెప్పుచుచున్నది. ఆయన వచ్చినప్పుడు ఆయనను చూచినవారి లేఖనముల సాక్ష్యము వలన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెనను మాట నమ్మదగినది. యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చింది పాపులకొరకే గాని నీతిమంతుల కొరకు కాదు. ఆయన లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లగా మనకు పరిచయం చేయబడ్డాడు. పాపియైన మానవుని రక్షించుటకు దైవత్వములో ఒకరు (క్రీస్తు) మానవులలో ఒకనివాడై శరీరధారియై పాప ప్రాయశ్చిత్తార్థబలిగా తన్ను తాను అర్పించుకొనెను. గనుక ఇప్పుడు క్రీస్తు రక్తము వలన మనకు విమోచన కలిగియున్నది. ఆయన రక్తము ప్రతి పాపిని పవిత్రపరచును.

యేసుప్రభువు నిశ్చయముగా పాపులను ప్రేమించెను, వారిని వెదకి రక్షించెను. గాని పాపమును ద్వేషించెను. పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈ లోకమునకు వచ్చెనను మాట మున్మాటికి నమ్మదగినది యని సహోదరులు గంభీరముగా ఉద్ఘాటించిరి.

మధ్యాహ్నకాల సమావేశమునకు Ch. జాన్‌బాబుగారు అధ్యక్షత వహించిరి. సోదరులు యు. స్టాలిన్‌గారు, కె. ప్రసాద్, బూల యోహాను, N. ఏలియా, బి. ప్రసాదరావ్, R. స్టీవెన్‌సన్, సాల్ గూటం, కె. ఐజక్, జల్లి ప్రసాదరావ్, జి. మ్రడక్, పి. ప్రకాశం, M. ఆల్‌ఫ్రెడ్, జాషువా గూటంగార్లు పై అంశముపై తమ అమూల్య సందేశముల నిచ్చిరి. M సాల్మన్, G.S. రావ్‌గార్లు ప్రార్థనలో నడిపించిరి. సోదరులు డి. అబ్రహాముగారు వందనసమర్పణ చేసిరి. మధ్యాన భోజన విరామ సమయంలో 5 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. డి. అబ్రహాముగారు, వారి కుమారుడు డి. చిరంజీవి గారు చక్కని ఏర్పాట్లు చేసి అందరి మన్ననల నందుకొనిరి. అబ్రాహాముగారు నడిపూడి, పాలగుమ్మి, అగ్రహారం, బండార్లంక గ్రామములలో క్రీస్తుకొరకు మంచి పని చేయుచున్నారు.

Regd. No. H/KD—45/KD H.O

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 633 001

No.

To

..........................................
..........................................
..........................................
..........................................